# చంద్రహారం

**- చల్లా సత్యవతి**

గాయత్రీ దేవి మూడు వారాలనుండి జ్వరంతో బాధపడ్తూ మంచంమీదనే వున్నది. ఈరోజు టెంపరేచరు తగ్గినట్లున్నది. చాలా నీరసంగా అనిపించి ఎవరైనా వేడిగా ఒక కప్పు కాఫీ యిస్తే బాగుండును అనుకుంది. కాని యింకా తెల్లవారినట్లు లేదు. పనిపిల్ల "మల్లి" ఆరుగంటలకుగాని లేచి కాఫీ చెయ్యదు. తానే మెల్లగా లేచి ముఖం కడుక్కుని కాఫీ చేసుకుందామని వంటింట్లోకెళ్ళింది. బ్రూకాఫీ డబ్బా ఖాళీగావుంది. పంచదార సీసా మీద మూతలేదు. చీమలు చక్కని క్రమశిక్షణతో బారులుగా వెళ్ళి విందు చేసు కుంటున్నాయి. గాయత్రికి నవ్వొచ్చింది. నాకంటే అవే నయం ఎవరిమీదా ఆధారపడకుండా కష్టపడి తింటున్నాయి అనుకుని చేసేదేమీ లేక మళ్ళీ మంచాన్నాశ్రయించింది.



మేగజైనులో పేజీలు తిరగేస్తుంటే ఫోను మ్రోగింది. ఇంత ప్రొద్దుటే ఎవరా అనుకుంటుంటే మల్లి లేచివచ్చి "హల్లో ఎవరూ" అని రెండునిమిషాల్లోనే పెట్టేసి 'రాంగ్ నెంబరమ్మా' అంటూ లోపలికెళ్ళిపోయింది. అయిదు నిముషాలైనా కాకుండానే మళ్ళీ రింగయితే ఈసారి తానే ఎత్తింది. అవతల వ్యక్తి, "మీరు గాయత్రీ మేడం గారేనా? నేను సూరిని, గుర్తుకు వచ్చానా? మీ అమ్మాయీ, నేనూ ఒకే స్కూల్లో చదువుకునేవారం" అని అన్నాడు. గాయత్రికి అస్సలర్థం కాక మౌనంగా వుండి పోయింది. మళ్ళీ అదే కంఠం, "నేను మీ 'కిరణ్'ని. కాకినాడలో మీఇంటి ప్రక్కన వుండే పూజారి గారబ్బాయిని" అనగానే గాయత్రికి ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి పెల్లుబికి వచ్చాయి.

"నువ్వు... నువ్వు నా కిరణ్‌వా! ఎక్కడినుంచి ఈ పిలుపు? ఎలా వున్నావు? ఏ చేస్తున్నావు? అన్నీ తెలుసు కోవాలని నామనస్సు ఆతృత పడుతోంది."

"ప్రస్తుతం హైదరాబాదునుండి మాట్లాడుతున్నాను. నేను చాలా బాగున్నాను. ఈరాత్రి బయలుదేరి రేపు మీ ఇంట్లో వుంటాను. సరేనా అపుడన్ని విషయాలు మాట్లాడుకుందాం" అని ఫోను పెట్టేసాడు. గాయత్రి ఆనందంతో తేలిపోతూ మల్లి తెచ్చిన కాఫీ ఒక గుక్కలో త్రాగేసి ఆలోచనలలో పడింది.

తన చిన్నతనం, తల్లిదండ్రుల ప్రేమ, రామమోహన్‌తో వైవాహికజీవితం, పిల్లలు, ఈ కిరణ్‌తో అనుబంధం అన్నీ సినిమా రీల్స్ మాదిరిగా మారిపోతున్నాయి. అమ్మా నాన్నలకు ఒకే సంతానం అయినా క్రమశిక్షణతో పద్ధతిగా పెంచారు. తాహతుకు మించినా మంచి స్కూల్లో చదివించారు. తన కుటుంబపు స్థితిగతులు అర్థం చేసుకుని కాలేజీలవైపు మ్రొగ్గకుండా టీచరు ట్రైనింగులో జేరింది. కష్టపడి ఆ కోర్స్ పూర్తిచేసి తన వూళ్ళోనే ఉద్యోగం సంపాదించింది. అదే స్కూల్లో సీనియర్ పోస్టులోవున్న రామమోహన్‌తో పరిచయం ప్రేమగా మారింది. తల్లిదండ్రులు సంతోషంగా వారి పెళ్ళిచేశారు. అయిదేళ్ళలో ఇద్దరు పిల్లల తల్లయింది. కొడుకుకు వంశీకృష్ణ అని, కూతురుకు సుధీర అని అని పేర్లు పెట్టుకున్నారు. ఇద్దర్నీ ఒకే పద్ధతులతో పెంచినా ఎందుకనో వంశీ చిన్నప్పటినుండీ దుడుకు స్వభావంతో సాటి పిల్లలతో పేచీలకు దిగేవాడు. సున్నిత మైన మందలింపులు పనిచేయలేదు. ఒకసారి ఎదురింటి అబ్బాయితో కొట్లాట పెట్టుకుని చేయి చేసుకుంటే, తండ్రి కలుగజేసుకుని కోపంగా రెండు దెబ్బలువేసి యింట్లోకి లాక్కు వచ్చాడు. వాడు పౌరుషపడి ఆ రాత్రి బీరువాలోనున్న వెయ్యి రూపాయలతో మాయ మయ్యాడు. ప్రక్కవూళ్ళలో వెతికించారు. పేపరులో వేయించారు. కానీ ఫలితం శూన్యం. గాయత్రి బాగా

బెంగపెట్టుకుని, కూతురిమీదే ప్రాణాలన్నీ పెట్టుకుంది.

సుధీర మాత్రం అన్నకు పూర్తి వ్యతిరేకం. చిన్నప్పటినుండి తల్లిదండ్రులను, పరిస్థితులను అర్థం చేసుకొని శ్రద్ధగా చదివి టీచర్ల మెప్పు సంపాదించింది. వారి ప్రక్క ఇంట్లో పూజారి రామ భద్రయ్యగారు కొడుకుతో అద్దెకుండేవారు. సూరి, సుధీర ఒకే క్లాసు చదివేవారు. కలిసే స్కూలుకెళ్ళడం, హోంవర్కు చేసుకోవడం, ఆడుకోవడంతో ఎంతో చనువుగా వుండేవారు.

గాయత్రి కూడా తన తప్పిపోయిన కొడుకుని వానిలో చూసుకుని తృప్తి పడేది. వాడి అందం చూసి 'కిరణ్' అని ముద్దుగా పిలుస్తూ తల్లిప్రేమను అందించేది. రామభద్రయ్య ఆ దంపతులను తాను పూజించే పార్వతీ పరమేశ్వరులుగా భావించేవాడు.

కాని ఆ ఆనందం ఎక్కువ రోజులు మిగలలేదు. ఒక రోజు కిరణ్ పరుగుపరుగున వచ్చి తమ ఇంటికి తీసుకు వెళ్ళాడు. పూజారిగారు విపరీతమైన ఆయాసంతో బాధ పడుతూ నోటమాట లేకుండా పడివున్నారు. రామమోహన్ డాక్టరుని తీసికొనివచ్చేలోపలే ఆయన ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి. పాపం కిరణ్ తల్లిదండ్రులు లేని అనాథగా మిగిలాడు. ఇల్లంతా శూన్యమయింది.

కిరణ్‌పై జాలి, కరుణ, ప్రేమలు గాయత్రిలో ప్రవహించాయి. వాడిని దగ్గరగా తీసుకొని 'నువ్వు అనాధవుకావు. మాబిడ్డవు. ఈరోజునుండే మా సుధీరతో సమానం. మా ఇంట్లోనే వుంటావు' అని తనతో తీసుకొని వెళ్ళింది. ఆ మరునాడు వాడి మేనమామ, భార్య వచ్చి కాస్సేపు దుఃఖించి తదుపరి కార్యక్రమాలు పూర్తిచేశారు. పదమూడవరోజు గాయత్రి దంపతులకు కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

'ఇన్నాళ్ళు మీరే వాడి తల్లిదండ్రులుగా మంచీ చెడూ చూశారు. మాబావ ఎప్పుడూ మిమ్మల్ని గురించే చెప్పేవాడు. వీడిని మేము తీసికొని వెళ్ళి, మాకున్నంతలో మా బిడ్డలలో బిడ్డలాగ చూసు కుంటాము. మీరిద్దరూ అపుడపుడు వచ్చి చూసివెళ్తే బిడ్డ బెంగనుండి కోలుకుంటాడు'. అందరికళ్ళూ చెమ్మ గిల్లాయి. కిరణ్ గాయత్రిని పట్టుకుని, వచ్చే ఏడుపుని ఆపుకుందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గాయత్రి పరిస్థితీ అలానేవుంది. ఏమనాలో తోచక, భర్తవైపు చూస్తే ఆయన కూడా నిస్సహాయంగా మౌనం వహించాడు.

చటుక్కున గాయత్రికి కర్తవ్యం గుర్తొచ్చి లోనికి వెళ్ళి, తన పెట్టెలో అడుగున భద్రంగా దాచిన చంద్రహారం చేతిలోనికి తీసుకుని కళ్ళకద్దుకుంది. కిరణ్ మేనమామను సమీపించి ఆయన చేతిలో పెట్టి, "నాకున్న విలువైన వస్తువు యిది ఒకటే. కిరణ్ స్కూలు ఫస్టు వస్తాడు. కాలేజీలో చేర్పించండి. ప్రస్తుతం మేము వాడికి చేయగలిగిందింతే. మంచిమనస్సుతో చేసిన ఏ పనైనా సత్ఫలితాలనిస్తుందని పెద్దలంటారు. మీరు చేసిన ఉపకారంవల్ల వీడికి మంచి భవిష్యత్తు వుంటుందనీ, మంచిమనిషిగా ఎదిగి ఎందరికో మంచి కలుగ జేస్తాడని నాకు అనిపిస్తోంది. తర్వాత వాడి అదృష్టం" కిరణ్ తలపై చేయివేసి మనస్సులోనే దీవించి, కన్నీళ్ళాపుకుంటూ వడివడిగా లోనికెళ్ళిపోయింది. ఎవరినోట మాటరాక ఒకరిముఖాలొకరు చూసు కుంటూ వుండిపోయారు. మేనమామ రామమోహన్‌కి నమస్కరించి "జగన్మాతవంటి అమ్మగారి కోరికను తీర్చడాన్కి ప్రయత్నిస్తాను. ఇంక మేము సెలవు తీసుకుంటాము" అన్నాడు. కిరణ్ రామమోహన్ పాదాలు తాకి గాయత్రికి దూరంనుండే వీడ్కోలు చెప్పి వెనుతిరిగాడు.

కాలమే అన్ని గాయాలకు మందు అన్నట్లు అప్పటి దుఃఖ తీవ్రత క్రమంగా తగ్గింది. ఈ పద్దెనిమిది ఏళ్ళలోనూ ఎన్నో సంఘటనలు మంచివీ, చెడ్డవీ కూడా జరిగాయి. సుధీర అన్ని క్లాసులలోను మంచి గ్రేడ్సు సంపాదించుకొని పోస్టుగ్రాడ్యుయేట్ అయింది. తాను ప్రేమించిన బెంగాలీ యువకుడిని పెళ్ళిచేసుకొని అమెరికా వెళ్ళిపోయింది. రామమోహన్ గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. గాయత్రి వంటరిగా, అనారోగ్యంతో మిగిలింది. అమెరికావచ్చి తమతో వుండమని కూతురికోరిక మేరకు ఒకసారి వెళ్ళి రెండునెలలకంటే వుండలేక పోయింది. వంటరితనం ఇంకా బాధించి తన స్వంతవూళ్ళోనే వుండటాన్కి నిర్ణయించుకొన్నది. ఇరుగుపొరుగు తనని గౌరవంగానే చూస్తారు. పనిమనిషి రమణమ్మ కూతురు మల్లిని చేరదీసి, దానికి చదువు నేర్పించి ఒక ఇంటిదాన్ని చేయాలని ప్రస్థుత ఆశయం. కిరణ్‌ని సుధీరతో సమానంగా ఏలోటూ లేకుండా పెంచి, పెద్దచేసి గొప్పవానిగా చూడాలనే తపన వుండేది. ఇపుడెలా వున్నాడో. కాస్సేపటిలో చూడబోతున్నాకదా! అని తనలోనే అనుకుని నవ్వుకుంది.

తాను ఎదురు చూస్తున్న క్షణం రానేవచ్చింది. ఉదయం ఎనిమిది గంటలకు టాక్సీనుండి హుందాగా దిగుతున్న కిరణ్‌ని చూసి తనకళ్ళను తానే నమ్మలేక పోయింది. అతను గుమ్మంవద్ద జోళ్ళువిప్పి నవ్వుతూ గాయత్రివద్దకు వచ్చి పాదాలను తాకాడు. గాయత్రి కన్నీళ్ళు అతని తలపై ముత్యాల్లాగా రాలాయి. ఆమె మనసు ఆర్ద్రమై కాసేపు నోటమాట రాలేదు.

"కిరణ్, ఇంత మంచిరోజు వస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఈమధ్య చాలా సుస్తి చేసింది. నిన్ను కళ్ళారా చూడటానికే దేవుడు నన్ను బ్రతికించాడు". అతని భుజంపై వ్రాలి తన్మయంగా కళ్ళుమూసుకున్నది. కిరణ్ 'నేనొచ్చేశాను. ఇంక మీకేమీ దిగులు వుండదు' అని భరోసా యిస్తున్నట్లు ఆమె భుజం మీద చేయి వేశాడు. కాఫీ టిఫెన్ తెస్తూన్న మల్లి ఆశ్చర్యంగా గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

మల్లి వేడివేడి ఇడ్లీలు, ఘుమఘుమలాడే సాంబారు గిన్నెలు తెచ్చి బల్లపై ఉంచింది.

"ఇడ్లీ సాంబారు నీకు ఎంతో ఇష్టమని చేయించాను తృప్తిగా తిను" అన్నది గాయత్రి.

బ్రేక్‌ఫాస్టు పూర్తిచేసి ఇద్దరూ సోఫాలో ప్రక్కప్రక్కగా కూర్చుని కబుర్లలో పడ్డారు. కిరణ్‌ని గురించి అన్ని వివరాలు వినాలని గాయత్రి ఎదురుచూస్తున్నది. ఉపక్రమించింది "నువ్వు హైస్కూలు చదువు పూర్తి చేయడం, ఇంతలో మీనాన్న గారిమరణం, మీ మామయ్య దగ్గరకు వెళ్ళడం తర్వాత నీసంగతులేమీ తెలియలేదు. మీ మామయ్యవాళ్ళు ఆవూరునుంచి వెళ్ళిపోయారని చెప్పారు. నువ్వెక్కడున్నావో, ఏం చదివావో ఏమీ నాకు తెలియవు. మీ మామయ్య చాలా వుత్తముడనిపించింది.ఇంతవాడవయ్యావంటే నీకు చాలా సహాయం చేసివుంటారు. భగవంతుడే ఆయనలోవుండి నీ అభివృద్ధికి కారణమయ్యాడని అనుకుంటున్నాను."

కిరణ్ చెప్పసాగాడు "అవును. మీరు చెప్పింది పూర్తిగా నిజమే. మామయ్య, అత్తయ్య వారి పిల్లలతో సమానం గానే కాదు, ఎక్కువగా కూడా నాకు ఎంతో మేలు చేశారు. కాని నా యీ అభివృద్ధి, ప్రస్తుతస్థితికి మీరే ముఖ్య కారణం." అన్నాడు.

తనేంచేసింది? ఇన్నేళ్ళు అసలు చూడనేలేదు. ఇలా అంటాడేమిటీ? అన్నట్లు తెల్లబోయి చూస్తోంది గాయత్రి.

కిరణ్ తనజేబులో భద్రంగా దాచిన చంద్రహారం బల్లపైనుంచాడు.

"మీరు ఆనాడు ప్రేమతో యిచ్చిన ఈ చంద్రహారమే నన్ను అన్నివేళలా ఆదుకుంది. ఈ నగను తాకట్టు పెట్టి నన్ను కాలేజీలో జేర్చాడు మామయ్య. తర్వాత నాకు స్కాలర్‌షిప్పు వచ్చింది. వేసవి సెలవులలో ఇద్దరు విద్యార్థులకు ట్యూషన్ చెప్పి ఆ డబ్బుతో నగను విడిపించుకున్నాను. అలాగే ఎన్నో సార్లు ఈ నగ నా అవసరాలను తీర్చింది. ప్రతీసారి ఎంతకష్టపడైనా హారాన్ని సంపాదించుకునేవాడిని. ఆ విధంగా నేను పోస్టు గ్రాడ్యుయేషను పూర్తిచేయగలిగాను. నేను ట్యూషన్ చెప్పినవాని తండ్రి పెద్ద ఆఫీసరు. ఆయనకు నాప్రవర్తన మీద, నిజాయితీ మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆయనే నన్ను ఐ.ఎ.యెస్. పరీక్షకు కట్టమని ప్రోత్సహించడమే కాక, చక్కటి కోచింగు కూడ ఇప్పించారు. క్రమంగా వారివల్ల నామీద నాకు నమ్మకం కుదిరి పరీక్ష వ్రాసి సెలక్టు అయ్యాను." అన్నాడు.

గాయత్రి ముఖంలో సంతోషంతో కూడిన వెలుగు గదంతా వ్యాపించింది.

"చిత్తశుద్ధితో ఏపని చేసినా సత్ఫలితాలు కల్గుతాయని మీరు చెప్పేవారు. ఆ ఫలితాన్నందు కోవటానికి నాకు ముగ్గురు కారణమయ్యారు. మీరు, మామయ్య, ఆఫీసరుగారు. మీ ముగ్గురిని ఈ జన్మలో మరచిపోలేను".

కిరణ్ మాటలకు గాయత్రి ఏమీ అనలేకపోయింది.

"సరే కిరణ్, పెద్ద ఆఫీసరు అయ్యావు. చాలా సంతోషమే గాని, జీవితంలో ముఖ్యమైన మంచి ఇల్లాలిని సంపాదించావా? అది చెప్పు."

"ఆ విషయాలలోకే వస్తున్నాను. మామయ్య, అత్తయ్యల కృషివలననే కదా నా యీ అభివృద్ధి. అందుకని వారి కుటుంబంలో మనిషినై వారికి అండగా వుండాలనే వుద్దేశ్యంతో వారి పెద్దమ్మాయి సంధ్యను వివాహం చేసుకున్నాను."

గాయత్రి కుతూహలంగా వింటోంది.

"చాలా మంచి అమ్మాయి. పెద్దపెద్ద డిగ్రీలు లేవు గాని మంచి అవగాహనా శక్తి, సంస్కారం నిండుగా వున్నాయి. సంధ్య నా జీవితాన్ని, చుట్టుప్రక్కలవారినీ కూడా ఆనందమయం చేస్తుందనే నమ్మకం నాకు."

గాయత్రి తృప్తిగా చిరునవ్వు నవ్వి అతని భుజం మీద చేయి వేసింది.

"మీకు ఇంకో ముఖ్యమైన విశేషం చెప్పాలి. రెండు నెలలక్రితం ట్రయినింగుకోసం అమెరికా వెళ్ళాను. మన

సుధీర కుటుంబంతో రెండు రోజులున్నాను. వారిద్దరూ చాలా బాగున్నారు. ఇద్దరు పిల్లలూ మీ గురించి ఎన్నో ప్రశ్నలడిగారు. ఇండియానుంచి వచ్చానని వాళ్ళకు తెలుసును. సుధీర మాత్రం అమ్మ తమతో వుండలేక పోతోందని, వంటరిగా వుంటోందని బాధపడింది. దానికి నేనొక చక్కని పరిష్కారం సూచించాను. ఇకముందు మీరు నాదగ్గర సుఖంగా వుండే ఏర్పాట్లన్నీ చేశాను. మనం ఆడుకోవటాన్కి రెండు నెలలలో ఓ చిన్ని పాపాయి రాబోతోంది. సుధీరను కుటుంబంతో సహా మనవద్దకువచ్చి, వీలైనన్ని రోజులు గడపడానికి కూడా ఒప్పించాను" గాయత్రికేసి చూసి, "నేను ఒక మిత్రుని ఇంటికి వెళ్ళాలి. అక్కడే డిన్నర్ చేసి విజయవాడకు బయలుదేరతాను. మళ్ళీవారం వచ్చి మిమ్మల్ని, మల్లిని కూడా తీసికొని వెళ్తాను. మీరనుకున్నట్లుగా మల్లికి విద్యాబుద్ధులు నేర్పించి ఒక ఇంటిదాన్ని చేద్దాం. సరేనా?" అని మరొకసారి గాయత్రికి చెప్పి బయలుదేరాడు.

ఈమాటలన్నీ అర్ధంచేసుకున్న మల్లి తన తల్లికి చెప్పడానికి సంతోషంగా పరుగెత్తింది. ఇదంతా కలో నిజమో కూడా తెలియని గాయత్రి తన యిష్టదైవానికి కృతజ్ఞతలు తెల్పుకోవాలని పూజగదిలోనికెళ్ళింది. శారదాదేవికి హారతిస్తుంటే ప్రక్కనే బల్ల మీద తాను పారాయణచేసే భగవద్గీత కనబడింది. చేతిలోనికి తీసుకుని పేజీలు తిప్పితే ౨వ అధ్యాయంలో ౪౦వ శ్లోకం ఎదురు వచ్చింది.

"నే హాభిక్రమనాశో స్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"

తాత్పర్యం:

పార్థా! ఈ కర్మయోగం ప్రారంభించి పూర్తిచేయలేక పోయినా వృధా అవదు. ఈ ధర్మం ఎంత కొంచెం ఆచరించినా మహత్తర భయాలనుండి రక్షిస్తుంది.

ప్రస్తుత తన పరిస్థితి సమంజసంగా తోచిన గాయత్రి ఆ గ్రంధాన్ని కళ్ళకద్దుకొని భక్తిగా బల్లపై నుంచింది.

ఓం తత్ సత్
సర్వేజనా సుఖినోభవంతు!

ROMASIA
BANK

RomAsia Bank
4287 US Highway 1
Monmouth Junction NJ 08852

609.897.8100
www.RomasiaBank.com

MEMBER FDIC

With Best Wishes
from
Peter A. Inverso, Chairman
Maurice T. Perilli
Dominick Mazzagetti, President & CEO
Dr. Harch Gill, Ph.D.
Michele N. Siekerka, Esq
Dr. Peter Yi
Eric Robert Lear, CPA
Nicholas Carnevale
Elsie Pang
James B. Kilgore
Dr. Richard H. Wong
*and everyone at RomAsia Bank!*

A BRIDGE TO BETTER BANKING